డీసీఎంఎస్ బ్రాంచ్‌ల ఏర్పాటుకు సహకరించండి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ దంపతులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ బ్రాంచీ కార్యాలయాల ఏర్పాటుకు అన్ని మండలాల్లో అవసరమైన స్థలాలు కేటాయించాలని చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య జిల్లా కలెక్టర్ జి.సృజనను కోరారు. గురువారం కలెక్టర్‌ను చాంబరులో కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందిస్తూ స్థలాలు కేటాయించే విధంగా ఆర్‌డీఓలు, తహసీల్దార్లకు ఆదేశాలు ఇస్తామన్నారు.

గోడ కూలి ఇద్దరికి గాయాలు

కర్నూలు (టౌన్): స్థానిక రాజ్‌విహార్ బస్టాప్ వద్ద నగరపాలక సంస్థ వాటర్ ఫౌంటెన్, లైటింగ్, డ్రైన్ పనులు చేపట్టింది. గురువారం కార్మికులు సుబ్రమణ్యం, షేక్షావలి పనులను పర్యవేక్షిస్తుండగా గోడ కూలి వారిపై పడింది. స్వల్పగాయాలైన వారిని వెంటనే పెద్దాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో గోడ తడిసి కూలిపోయిందని నగరపాలక ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్ తెలిపారు.





అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

● కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్


మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. ఇప్పటికే ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందజేశామని, ఏదైనా కారణం చేత మిగిలిపోయిన వారికి ప్రభుత్వ ఫలాలు అందజేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. స్థానిక 10, 22, 45 వార్డుల పరిధిలోని 25, 56, 57, 116, 117, 118 సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహించిపలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము కరోనా సమయంలో ఆక్సిజన్ కాన్సంట్రేట్ కిట్లు, సిలిండర్లు, నిత్యావసర సరుకులు అందించామన్నారు. ఆ సమయంలో టీడీపీ నేతలు ఎక్కడ దాక్కున్నారన్నారు. ఎన్నికలు మరో ఆరు నెలలు ఉన్నాయని ఇప్పుడు హడావుడి చేస్తున్నారన్నారు.

పథకాల మంజూరులో పారదర్శకత

కర్నూలు(రాజ్‌విహార్): పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ఖడక్‌పురా వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాజకీయాలు, వర్గాలకు తావు లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పథకాలు తీసుకొచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్, పార్టీ నాయకులు నూరుల్లా ఖాద్రీ, ఫైజల్‌ఖాన్, జుబేర్, దాదూద్, షబ్బీర్ పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే కలవండి

సమస్యలు ఉంటే తనను కలిసి చెప్పుకొని పరిష్కారం పొందవచ్చని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. గురువారం ఆయన పాతబస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ ద్వారా వినతిప్రతాలు స్వీకరించారు. తాగు నీరు, డ్రైనేజీ, కల్వర్టులు, వీధి దీపాలు తదితర సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు.

జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం


జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): స్థానిక దేవి ఫంక్షన్ హాలులో గురువారం జాతీయ చేనేత సిల్క్ ఎక్స్‌పోను మేయర్ బీవై.రామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ జాతీయ చేనేత వృత్తి కళాకారుల సంఘం, హస్తకళాకారులచే తయారైన ఉత్పత్తులు నేరుగా విక్రయించడం ద్వారా నాణ్యత, తక్కువ ధరల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఎక్స్‌పో మేనేజర్ మహేష్ మాట్లాడుతూ వచ్చే నెల 16 వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

మైనర్లు వాహనాలు నడపరాదు

కర్నూలు: ఎట్టి పరిస్థితుల్లో మైనర్లు వాహనాలు నడపరాదని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం అన్నారు. రాజ్‌విహార్, సి.క్యాంప్ సెంటర్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్‌రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో గురువారం డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ వెళ్తున్న 25 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కింద రూ.50,875 తల్లిదండ్రులకు జరిమానా విధించారు. సాయంత్రం పోలీస్‌స్టేషన్ వద్ద ట్రాఫిక్ నియమాలపై మైనర్లకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అలాగే కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలోని బృందావన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై డీఎస్పీ అవగాహన కల్పించారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): తూకాల్లో మోసాలకు పల్పడితే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు హెచ్చరించారు. గురువారం పెద్దపాడు రోడ్డులోని ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేయగా 25 కేజీలగాను కేజీ తూకం తక్కువ రావడంతోపాటు ఎరువుల బస్తాపై సరైన చిరునామా, ముద్ర లేనందున కేసులు నమోదు చేశారు. అధిక రేటుకు విక్రయించినందుకు రూ.25 వేల అపరాధ రుసుం విధించారు.

మహిళా జాతికే అవమానం

కర్నూలు కల్చరల్: మణిపూర్ ఘటన మహిళా జాతికే అవమానమని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు కావెం సుబ్బలక్ష్మి అన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మణిపూర్ దారుణ కృత్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాలక వర్గాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నరసం కార్యదర్శి దండబోయిన పార్వతీ దేవి, సభ్యులు పసుపులేటి నీలిమ, సునీత, రత్నలక్ష్మి, లీలావతి, జ్యోత్స్న, సువర్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలు పేదలకు వరం

కర్నూలు(హాస్పిటల్): ఉచిత వైద్యశిబిరాలు పేదలకు వరమని సాయిబాబా ఆలయ పాలక మండలి సభ్యులు లక్ష్మీనారాయణ అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ యశోదా హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ షణ్ముక పలువురికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అదించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు వెంకటేశ్వర్లు, ఆర్వేటి జగదీష్, వెంకటేశ్వర్లు, నరసింహాచారి, క్యాంపు కో ఆర్డినేటర్ గణేష్ పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాల కూల్చివేత

కర్నూలు (టౌన్): నగరంలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చర్యలకు ఉపక్రమించారు. గురువారం కోడుమూరు రోడ్డులోని నయారా పెట్రోల్ బంకు సమీపంలో అనుతులు లేకుండా అదనపు ఫ్లోర్ నిర్మాణాలు చేపడుతుండటంతో ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రంగస్వామి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్ ఘటనా స్థలానికి చేరుకొని అక్రమ నిర్మాణాలను తొలగించారు.

ఒకేషనల్ కాలేజీలో వనమహోత్సవం

కర్నూలు సిటీ: స్థానిక బి.క్యాంపులోని ప్రభుత్వ ఒకేషన్ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. ఏపీ టూరిజం జిల్లా మేనేజర్ హాజరై.. కాలేజీ ఆవరణంలో మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలన్నారు.

కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్‌గా విజయమనోహరి నేడు ప్రమాణ స్వీకారం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్‌పర్సన్‌గా ఎస్వీ విజయ మనోహరి శుక్రవారం బిర్లాగేట్ సమీపంలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. అనంతరం జిల్లా సహకార కేంద్రబ్యాంకులోని చైర్‌పర్సన్ చాంబరులోకి ప్రవేశించి బాధ్యతలు స్వీకరిస్తారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ జి.సృజన

కర్నూలు (సెంట్రల్): ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, వాటి నిరోధానికి తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల పురోగతి, ఆరోగ్యం, వైద్యం, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలపై కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యానికి సంబంధించి నాన్ కమ్యునికబుల్ డిసీజ్ సర్వేలో 83 శాతం పురోగతి సాధించారని, 100 శాతం చేరుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. డెంగీ, మలేరియా తదితర వ్యాధులు విజృంభించే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాడు–నేడు కింద నిర్మిస్తున్న పీహెచ్‌సీలను సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న యూపీహెచ్‌సీల నిర్మాణాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక భవనాలను సెప్టెంబర్ 30లోపు పూర్తి చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారులను సచివాలయాల వారీగా ఎంపిక చేయాలన్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంప్ ఆఫీస్ నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన పాల్గొన్నారు.





